సాక్షి ఖమ్మం

మంగళవారం। 30। జూలై। 2024



కనుమరుగైన జ్ఞాపకం !

ఖమ్మం హెడ్‌పోస్టాఫీస్ పాత భవనాన్ని ఇటీవల నేలమట్టం చేయడంతో ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన జ్ఞాపకం కనుమరుగైపోయింది. 10లో



..సద్వినియోగం చేసుకోండి

శిక్షణ, అధ్యయనం నిమిత్తం వచ్చిన కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సన్యాసయ్య సమావేశమయ్యారు. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 33° / 25°

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

విజయ డెయిరీ డీడీగా మోహనమురళి



బాధ్యతలు స్వీకరిస్తున్న మోహనమురళి

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం జిల్లా పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ(విజయ) ఉప సంచాలకులుగా నియమితులైన పి.మోహనమురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కామారెడ్డి జిల్లా నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. అలాగే, ఖమ్మం ఇన్‌చార్జిగా డీడీ ఉన్న ధన్‌రాజ్ నిజామాబాద్ బదిలీ చేశారు. ఈనేపథ్యాన బాధ్యతలు చేపట్టిన మోహనమురళి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పాల సేకరణ లక్ష్యాన్ని పెంచేలా ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం 10వేల లీటర్ల పాల సేకరణను లక్ష్యంగా ఎంచుకున్నామని చెప్పారు. అలాగే, ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ హాస్టళ్లకు విజయ పాల సరఫరా జరుగుతుండగా, భద్రాద్రి జిల్లాలోనూ రెండు, మూడు రోజుల్లో సరఫరా మొదలవుతుందని తెలిపారు. ఈమేరకు మోహనమురళికి డెయిరీ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

మత్స్యకారులకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రెడ్డి

కూసుమంచి: పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్య సహకార సంఘాల సభ్యులు మూడు రోజుల పాటు ఇవ్వనున్న నైపుణ్య శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పాలేరు పరిశోధనా కేంద్రం పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మత్స్యకారుల, మత్స్య రైతులు శిక్షణను సద్వినియోగం చేసుకుని తెలంగాణను ఆక్వా హబ్‌గా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం శాస్త్రవేత్తలు చేపల ప్రాముఖ్యత, ఆహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, శాస్త్రవేత్త రవీందర్, మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'పొలం బాట'ను సద్వినియోగం చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ, అధికారులు

చింతకాని: విద్యుత్ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పొలంబాటను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏస్ఈ సురేందర్ సూచించారు. మండలంలోని రాఘవాపురంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఒరిగిన స్తంభాలు, కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను గుర్తించి సరిచేస్తామని తెలిపారు. అలాగే, విద్యుత్ భద్రత, పొదుపుపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కాగా, రైతులు మోటార్లకు తగిన సామర్థ్యం కలిగిన కెపాసిటర్లను వాడాలని కోరుతూ ఓ రైతు మోటార్‌కు ప్రయోగాత్మకంగా అమర్చి లాభాలను వివరించారు. అనంతరం పలువురు రైతులు తమ సమస్యలను విన్నవించారు. ఈ డీఈ రామారావు, ఏడీ తిలక్, ఏఈ వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో తాత్కాలిక పద్ధతిపై మహిళా అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ వేల్పుల విజేత తెలిపారు. సాఫ్ట్ టాయిస్ తయారీతో పాటు బుట్టలు, చీపుర్ల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు 10వ తరగతి ఆపై విద్యార్హత, సంబంధిత ట్రేడ్‌లో సర్టిఫికెట్ కలిగిన ఒక్కొక్కరిని నియమిస్తామని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఆగస్టు 1వ తేదీ మధ్యాహ్నం 2గంటల్లోపు టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో దరఖాస్తులు అందించాలని, వివరాల కోసం 76600 22512నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కాగా, అనుభవం ఉన్న వారికి నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

సవారీకి హైవే రెడీ..!

జిల్లాలో మరో జాతీయ రహదారి నిర్మాణం పూర్తయింది. సూర్యాపేట జిల్లా మీదుగా ఖమ్మం జిల్లా వరకు రవాణా సౌకర్యం మెరుగయ్యేలా నిర్మించిన హైవే పనులు పూర్తికావడంతో ఇప్పటికే రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ హైవేను త్వరలోనే అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. – నేలకొండపల్లి

కోదాడ - ఖమ్మం హైవే 365 (ఏ) పనులు పూర్తి

- రూ.1,039 కోట్ల వ్యయంతో 31 కి.మీ. మేర నిర్మాణం
- నేలకొండపల్లి మండలం పైనంపల్లి వద్ద టోల్‌ప్లాజా
- ఆగస్టులో ప్రారంభానికి ఏర్పాట్లు



నిర్మాణం పూర్తయిన జాతీయ రహదారి

'భారతమాల' పథకం ద్వారా...

సూర్యాపేట – ఖమ్మం జిల్లాలను కలుపుతూ 31.800 కి.మీ. నిడివితో కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి 365(ఏ) నిర్మించారు. ఇందుకోసం భారతమాల పరియోజన ప్రాజెక్ట్ కింద రూ.1,039 కోట్ల నిధులు వెచ్చించారు. ఈ రహదారి సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని అలవాలపురం శివారులో మొదలై ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి క్రాస్ రోడ్డు వరకు ఉంటుంది.

ఇకపై మెరుగైన రవాణా

జాతీయ రహదారి నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. తెలంగాణ నుంచి ఏపీ, ఇతర రాష్ట్రాలకు వెళ్లే భారీ వాహనాలు ఇకపై సాఫీగా ప్రయాణం సాగించొచ్చు. ఈ రహదారి నిర్మాణానికి రైతుల నుంచి భూములు సేకరించింది. నేలకొండపల్లి మండలంలోని జిల్లా సరిహద్దు గ్రామమైన పైనంపల్లిలో చాలా మంది ప్రజలు ఈ హైవే నిర్మాణంలో పక్కా ఇళ్లను సైతం కోల్పోయారు. వీరికి సరిపడా పరిహారం చెల్లించలేదని ఆందోళనలు చేపట్టగా.. గువ్వలగూడెం వద్ద అండర్ పాస్ కోసం అక్కడి ప్రజలు దీక్ష కూడా చేశారు. ఇవన్నీ పరిష్కారం కావడంతో ఎట్టకేలకు హైవే నిర్మాణం పూర్తయింది. కాగా, గతంలో కోదాడ-ఖమ్మం రహదారి అధ్వానంగా ఉండేది. ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తిపోయేవారు. ఇప్పుడు హైవే నిర్మాణంతో వారి కష్టాలు తీరనుండగా తెలంగాణ మీదుగా ఇతర రాష్ట్రాలకు రవాణా సాఫీగా సాగనుంది.

పైనంపల్లిలో టోల్‌ప్లాజా

జాతీయ రహదారిలో భాగంగా నేలకొండపల్లి మండలం పైనంపల్లి వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటుచేశారు. హైవేను అధికారికంగా పారంభించిన రోజు నుంచే టోల్ వసూళ్లు మొదలుపెట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా, టోల్ ప్లాజా నిర్వాహకులు అంబులెన్స్‌లు సిద్ధం చేయడంతో పాటు ప్రమాదాల సమయాన వాహనాలను పక్కకు తీసేందుకు ప్రత్యేక వాహనం కూడా సిద్ధం చేశారు.



పైనంపల్లి వద్ద టోల్‌ప్లాజా

నెరవేరని 'ఎగ్జిట్' కల

కోదాడ – ఖమ్మం జాతీయ రహదారిపై నేలకొండపల్లి వద్ద ఎగ్జిట్ ఇవ్వాలని స్థానికులు పనులు మొదలైన నాటి నుంచి కోరుతున్నా అమలుకు నోచుకోలేదు. మండల కేంద్రంతో పాటు ఇతర మండలాలకు చెందిన ప్రజలు హైవేపైకి రావాలంటే ఎగ్జిట్ లేని కారణంగా అవస్థ పడాల్సి వస్తుంది. నేలకొండపల్లిలో బౌద్ధక్షేత్రం, రామదాసు ధ్యాన మందిరం లాంటి చారిత్రక ప్రదేశాలకు సందర్శకులు వస్తారు. అయినా టోల్‌గేట్‌కు వెళ్లేంత వరకు ఎగ్జిట్ లేకపోవడంతో దూరాభారం కానుంది.

కేంద్రం సహకారంతో హైవేలు



కేంద్రప్రభుత్వం రహదారుల అభివృద్ధికి పాటుపడుతోంది. ప్రధాని మోడీ హయాంలో అనేక హైవేలు నిర్మించారు. ప్రస్తుతం కోదాడ – ఖమ్మం రహదారి రెండు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగపడుతుంది. కేంద్రానికి ప్రజలు రుణపడి ఉంటారు.

– పాగర్తి సుధాకర్, నేలకొండపల్లి

ఎగ్జిట్ ఇవ్వాల్సిందే...



మండల కేంద్రంలో ఎగ్జిట్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఎన్నో చారిత్రక ప్రదేశాలు ఉన్న ఇక్కడకు దేశ, విదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తారు. వీరికి ఇబ్బంది కలగకుండా ఎగ్జిట్ ఇచ్చేందుకు పాలకులు, అధికారులు స్పందించాలి.

– మొగరపు రోశయ్య, నేలకొండపల్లి

హైవేతో సమయం ఆదా



కోదాడ-ఖమ్మం జాతీయ రహదారితో సమయం ఆదా అవుతుంది. కోదాడ నుంచి ఖమ్మంకు వివిధ పనుల నిమిత్తం వచ్చివెళ్తుంటాను. ఇన్నాళ్లు అవస్థలు ఎదురయ్యేవి. ప్రస్తుతం హైవే నిర్మాణం పూర్తికావడంతో ఆ సమస్యలు తీరినట్లే.

– రావెళ్ల కృష్ణారావు, కోదాడ, సూర్యాపేట జిల్లా

రెండో విడతకు సిద్ధం..

- నేడు రైతులకు రూ.1.50 లక్షల లోపు రుణమాఫీ
- జిల్లాలో 34,116 మందితో జాబితా
- బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో భేటీ కానున్న కలెక్టర్

ఖమ్మంవ్యవసాయం: రైతులకు సంబంధించి రెండో విడత పంట రుణాల మాఫీకి ప్రభుత్వం సిద్ధమైంది. రూ.1.50 లక్షల వరకు రుణం కలిగిన రైతుల ఖాతాల్లో మంగళవారం నగదు జమ చేయనున్నట్లు ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు అసలు, వడ్డీతో కలిపి రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీకి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రూ. లక్ష లోపు రుణమాఫీ నిర్వహించారు. ఈ విడతలో 18వ తేదీన జిల్లాలోని 59,172 మంది రైతుల ఖాతాల్లో రూ.264.22 కోట్లు జమ చేసినట్లు వెల్లడించిన విషయం విదితమే.

లోపాలమయంగా తొలిదశ

జిల్లాలో మొత్తం 3.21 లక్షల మంది రైతులు సుమారు రూ.2,300 కోట్ల మేర రుణాలు తీసుకోగా.. తొలి విడతలో నిర్వహించిన రూ.లక్ష లోపు రుణమాఫీ చాలా మందికి వర్తించలేదనే ఫిర్యాదులు అందాయి. ప్రధానంగా డీసీసీబీ పరిధిలో 1,69,864మందికి గాను రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న 1,43,327 మందికి రూ.526 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. కానీ 37,625 మంది రైతులకే రూ.121.63 కోట్లు అందాయి. పలు సంఘాల్లో వడ్డీ మాత్రమే మాఫీ చేస్తూ జాబితాలో పొందుపర్చినట్లు తెలిసింది. ఎర్రుపాలెం మండలంలో 1,600 మంది రైతులకు ఈ పరిస్థితి ఎదురైంది.

రెండో విడతలో 34,116 మంది

రెండో విడతలో రూ.1.50 లక్షల మేర పంట రుణం కలిగిన రైతులకు మాఫీ వర్తించనుండగా.. సోమవారం రాత్రి మండలాల వారీగా జాబితా విడుదలైంది. ఈ జాబితా ఆధారంగా జిల్లాలో 34,116 మంది రైతులు ఉండగా.. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారి ఖాతాల్లో నేరుగా నగదు జమయ్యే అవకాశం ఉంది. పీఏసీఎస్‌ల ద్వారా రుణం తీసుకున్న వారికి మాత్రం డీసీసీబీలో జమ అయితే అక్కడి నుంచి రైతుల ఖాతాలకు బదలాయిస్తారు. కాగా, తొలి విడతతో పోలిస్తే రెండో విడత జాబితాలో రైతుల సంఖ్య తక్కువగా ఉండడం గమనార్హం.

మండలాల వారీగా రెండో విడత రుణమాఫీ జాబితా

మండలం	రైతుల సంఖ్య
తిరులాయపాలెం	2,504
కూసుమంచి	2,287
నేలకొండపల్లి	2,183
కొణిజర్ల	1,991
కల్లూరు	1,935
ఖమ్మం రూరల్	1,887
తల్లాడ	1,848
చింతకాని	1,842
బోనకల్	1,804
వేంసూరు	1,768
ముదిగొండ	1,727
రఘునాథపాలెం	1,627
సింగరేణి	1,574
మధిర	1,440
పెనుబల్లి	1,438
కామేపల్లి	1,318
ఎర్రుపాలెం	1,307
వైరా	1,243
ఏన్కూరు	1,084
సత్తుపల్లి	917
ఖమ్మం అర్బన్	392
మొత్తం	34,116

అంతేకాక మొదటి విడతలో అర్హత ఉన్నా రుణమాఫీ కాని వారికి రెండో విడతలో అవకాశం దక్కుతుందని అధికారులు చెప్పినా అలా జరగలేదని తెలుస్తోంది.

నేడు కలెక్టర్ సమీక్ష

రెండో విడతకు రుణమాఫీని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యాన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం ఉదయం బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో సమావేశం కానున్నారు. ఈసందర్భంగా ఆయన జిల్లాలో అర్హులైన రైతులు, వారి రుణాలపై ఆరా తీసి ఖాతాల్లో జమ చేయాల్సిన అంశంపై దిశానిర్దేశం చేసే అవకాశముంది.

పెదవాగు రింగ్‌బండ్ పనులు ప్రారంభం

అశ్వారావుపేట: మండలంలోని గుమ్మడవల్లి గ్రామ సమీపాన ఇటీవల గండి పడిన పెదవాగు ప్రాజెక్టు వద్ద రింగ్ బండ్ నిర్మాణాన్ని సోమవారం ప్రారంభించారు. ఈనెల 18న వరద తాకిడితో ప్రాజెక్ట్ కట్ట కోతకు గురైన విషయం తెలిసిందే. కాగా, రింగ్‌బండ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేయంతో పనులు మొదలయ్యాయి.



యంత్రాలతో పనులు చేస్తున్న దృశ్యం

ఇదెలా సాధ్యమైంది?!

- కుక్కలకు శస్త్రచికిత్సపై అనుమానాలు
- ఖమ్మంలో 5వేల కుక్కలు ఉన్నట్లు చెబుతున్న కేఎంసీ
- కానీ 7వేల కుక్కలకు శస్త్రచికిత్స చేసినట్లు రికార్డులు
- వివరాలు ఆరా తీస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ) పరిధిలో కుక్కల నియంత్రణ కోసం యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఏర్పాటు చేశారు. 2021 మార్చిలో ఈ సెంటర్‌ను ప్రారంభించగా ఇప్పటి వరకు 7వేల కుక్కలకు శస్త్రచికిత్స చేయించినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ వద్ద రికార్డుల్లో మాత్రం నగరంలో 5వేల కుక్కలే ఉన్నట్లు చూపిస్తుండడం గమనార్హం. ఈ లెక్కలు పక్కన పెడితే గత నెల రోజులుగా కుక్కల బెడదపై కేఎంసీకి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రికార్డుల్లో ఉన్న సంఖ్య కంటే ఎక్కువ కుక్కలకు శస్త్రచికిత్స చేసినట్లు చెబుతున్నా.. మళ్లీ ఫిర్యాదులు అందుతుండడం అనుమానాలకు తావిస్తోంది.

అసలేం జరిగి ఉంటుంది?

ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి కుక్కల బెడదపై ఫిర్యాదులు పెరుగుతుండడంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక దృష్టి సారించారు. ఏబీసీలో కుక్కలకు శస్త్రచికిత్స చేయించాలని కమిషనర్ చొరవ చూపుతున్న తరుణంలో ఊహించని విధంగా లెక్కలు వెలుగు చూడడం గమనార్హం. నగరంలో 5వేల కుక్కలు ఉంటే 7వేల కుక్కలకు ఎలా శస్త్రచికిత్స నిర్వహించారు.. మిగిలిన కుక్కలు ఎక్కడి నుంచి వచ్చాయి.. గతంలో బంధించిన వాటిని ఎక్కడ వదిలారనే వివరాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ఏబీసీపై నిఘా..

కొన్నాళ్ల క్రితం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిషేక్ అగస్త్య పలుమార్లు ఏబీసీ సెంటర్‌ను సందర్శించారు. ఈక్రమంలోనే అక్కడ జరుగుతున్న శస్త్రచికిత్సలపై ఆయనకు అనుమానాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో సెంటర్ నిర్వహణపై నిఘా పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. తొలుత సెంటర్ మొత్తం సీసీ కెమెరాలు బిగించేందుకు సిద్ధమయ్యారు. ప్రతిరోజు ఎక్కడ కుక్కలను బంధిస్తున్నారు, ఎన్నేసి జీవాలకు శస్త్రచికిత్స నిర్వహిస్తున్నారు.. ఆతర్వాత వాటిని ఎక్కడ వదిలేస్తున్నారో రికార్డులు పొందుపర్చాలని ఆదేశించారు. మరో పక్క ఏసీబీ ఇన్నాళ్లు ప్రైవేట్ ఏజెన్సీ నిర్వహణలో ఉండగా.. ఇకపై పశు సంవర్ధక శాఖకు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

తొలగిన 'ప్రమాదం'

- భద్రాచలం వద్ద రాత్రి 9గంటలకు 42.90 అడుగులకు చేరిన గోదావరి
- మొదటి ప్రమాద హెచ్చరిక కూడా ఉపసంహరణ
- ఏజెన్సీలో రాకపోకలు పునఃప్రారంభం
- ఇంకా పునరావాస శిబిరంలోనే ముంపు కాలనీలవాసులు



భద్రాచలం వద్ద తగ్గిన గోదావరి ప్రవాహం

భద్రాచలం : భద్రాచలం వద్ద గోదావరి క్రమేపీ తగ్గుతోంది. సోమవారం రాత్రి 9 గంటలకు నీటిమట్టం 42.90 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను సైతం ఉపసంహరించారు. ఉదయం 7 గంటలకు 45.40 అడుగుల మేర ఉండగా, మధ్యాహ్నం ఒంటిగంటకు 44 అడుగులకు చేరింది. సాయంత్రం 6 గంటలకు 43.2 అడుగులతో 9,41,704 క్యూసెక్కుల నీటితో ప్రవహించింది. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు 43 అడుగుల వద్ద నిలకడగా ప్రవహించిన గోదావరి రాత్రి 9గంటలకు మరికొంత తగ్గడంతో ఆర్డీఓ దామోదర్‌రావు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం, తాలిపేరు ఉధృతి సైతం తగ్గడంతో అధికారులతో పాటు ఏజెన్సీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రాకపోకలు షురూ..

ఏజెన్సీలో పలు ప్రధాన రహదారులపైకి గోదావరి వరద నీరు చేరడంతో వారం రోజులుగా అన్నివైపులా రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి నీటిమట్టం తగ్గడంతో సోమవారం రవాణా ప్రారంభమైంది. భద్రాచలం నుంచి చర్ల, వెంకటాపురానికి, జాతీయ రహదారిపై తాత్కాలికంగా పోసిన కరకట్టను తొలగించడంతో కూనవరం, చింతూరు వైపు ఆటోలు, ఇతర వాహనాలు తిరిగాయి. ఇక భద్రాచలంలోని నన్నపనేని మోహన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి తరలించిన ఏఎంసీ, అశోక్‌నగర్ కొత్తకాలనీ వాసులను ప్రస్తుతం అక్కడే ఉంచారు. గోదావరి వరద పూర్తిగా తగ్గితే మంగళవారం వారిని ఇళ్లకు తరలించే అవకాశం ఉంది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కరకట్ట, ముంపు కాలనీ, ఇతర ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లారు.

గోదాములను పరిశీలించిన చైర్మన్

ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా, రఘునాథపాలెం మండలం జింకల తండాలోని గోదాంలను రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన గోదాముల సామర్థ్యం, హమాలీల సంఖ్య తదితర వివరాలు ఆడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మొక్కలు నాటగా సిబ్బంది ఆయనను సత్కరించారు. కాగా, రాయల నాగేశ్వరరావును ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి క్రాస్ వద్ద ఖమ్మం గ్రానైట్ ట్రేడర్లు, మార్కర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన సత్కరించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, గిడ్డంగుల శాఖ ఆర్ఎం పద్మావతి, మేనేజర్ సుందర్‌లాల్, నాయకులు మహ్మద్‌జావీద్, మొక్కా శేఖర్‌గౌడ్, జానీ, నరేందర్, కిషన్, ఉపేందర్, బచ్చలికూర నాగరాజు, జెర్రిపోతుల అంజని, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



రాయలను సన్మానిస్తున్న గ్రానైట్ ట్రేడర్ల బాధ్యులు

75మంది ఎస్జీటీలకు పదోన్నతి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న 75మంది ఎస్జీటీలకు పదోన్నతి లభించింది. వీరికి ఎస్ఏలుగా పదోన్నతి కల్పిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖర శర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం ఆప్షన్లు ఇచ్చుకోగా వారికి పోస్టింగ్ ఇచ్చారు. ఆయా ఉపాధ్యాయులు తక్షణమే నూతన స్థానాల్లో చేరాలని సూచించారు.

కేజీబీవీలో అపరిశుభ్రతపై అసహనం

తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మధుసూదన్



రఘునాథపాలెం కేజీబీవీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

రఘునాథపాలెం /కామేపల్లి/కారేపల్లి: రఘునాథపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల(కేజీబీవీ)ను సోమవారం అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు భోజనం వడ్డించే ప్రాంతం లో అపరిశుభ్రంగా ఉండడం, ఈగలు వాలుతుండడాన్ని గుర్తించిన ఆయన నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆతర్వాత విద్యార్థులతో మాట్లాడి తరగతుల నిర్వహణ, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ, మెనూ అమలుపై ఆరా తీశారు. అలాగే, కామేపల్లి, కారేపల్లిలోని కేజీబీవీలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ అక్కడి తహసీల్దార్ కార్యాలయాలనూ సందర్శించి ధరణి దరఖాస్తుల పరిష్కారంపై ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ఎస్ఓ లత, డిప్యూటీ వార్డెన్ తులసీదాస్, తహసీల్దార్లు విల్సన్‌బెన్నీ, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సివిల్స్ శిక్షణార్థుల మృతిపై ఎంపీ సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్: ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో ఢిల్లీలో శిక్షణ తీసుకుంటున్న ముగ్గురి మృతిపై బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర సంతాపం ప్రకటించారు. ఢిల్లీలో భారీ వరదతో తాన్యా సోని, నవీన్ దల్విన్, శ్రేయా యాదవ్ మృతి చెందిన అంశాన్ని సోమవారం ఆయన రాజ్యసభలో ప్రస్తావించారు. ఇలాంటి ప్రమాదాలు, తప్పిదాలు భవిష్యత్‌లో జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నిచర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

నేటి నుంచి ఎమ్మార్పీలకు శిక్షణ

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల్లో నైపుణ్యాలను పరీక్షించేలా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. తొలిదశలో తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం సబ్జెక్టులపై మండల స్థాయి రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. ఈనెల 30, 31వ తేదీల్లో డైట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యాన వీరికి అవగాహన కల్పించనుండగా ఆతర్వాత ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

అద్దె అగ్రిమెంట్ చేయలేదని బ్యాంకుకు తాళం

సత్తుపల్లిటౌన్: అద్దె అగ్రిమెంట్ విషయంలో జాప్యం కారణంగా భవనానికి యజమాని తాళం వేసిన ఘటన ఇది. సత్తుపల్లి పాతసెంటర్‌లోని చలసాని హరికృష్ణకు చెందిన భవనంలో యూనియన్ బ్యాంకు కొన్నేళ్లుగా కొనసాగుతోంది. అయితే రెండేళ్ల నుంచి లీజ్ అగ్రిమెంట్ విషయమై అధికారులు స్పందించడం లేదంటూ సోమవారం బ్యాంకు తెరవకముందే యజమాని తాళం వేశారు. దీంతో అధికారులు వచ్చాక రెండో తాళాన్ని గమనించి అవాక్కయ్యారు. చివరకు ఉన్నతాధికారులు యజమాని హరికృష్ణతో సంప్రదింపులు జరిపి వారంలోగా అగ్రిమెంట్ చేస్తామని హామీ ఇవ్వడంతో తాళం తీయగా.. సాయంత్రం 3.30 గంటల నుంచి సేవలు ప్రారంభమయ్యాయి. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ రామారావును వివరణ కోరగా స్పందించేందుకు నిరాకరించారు.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సోమవారం 14 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బీజాపూర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న 14 మంది మావోయిస్టులు బీజాపూర్ డీఎస్పీ సుధీర్ సర్కార్ ముందు లొంగిపోయారు. వీరందరికీ తక్షణ ఆర్థిక సాయం అందించారు. వీరంతా పలు ఇన్‌ఫార్మర్ల నెపంతో పలువురిని హతమార్చిన సంఘటనలలో పాల్గొన్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో లొంగుబాటుతో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

డిగ్రీ విద్యార్థి హత్య కేసులో 11 మంది అరెస్ట్


పాల్వంచ: డిగ్రీ విద్యార్థి హత్య కేసులో 11 మంది నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో 10 మంది మైనర్ బాలురే ఉన్నారు. సీఐ వి.వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. ఈ నెల 27న మండలంలోని బసవతారక కాలనీ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో విచక్షణా రహితంగా కొట్టడంతో డిగ్రీ విద్యార్థి అల్లూరి విష్ణు అక్కడికక్కడే మృతి చెందాడు. గత ఫిబ్రవరి 17న జూనియర్ కళాశాలలో ఫేర్ వేల్ కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో అక్కడికి డెకరేషన్ పనిమీద వచ్చిన డిగ్రీ విద్యార్థి విష్ణుకు, జూనియర్ కళాశాల విద్యార్థి సాలెంరాజ్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో విష్ణుపై దాడికి పాల్పడ్డారు. కాగా శనివారం కళాశాల ప్రాంగణంలో ఇరువర్గాలవారు తారస పడి గొడవ పడ్డారు. అదే రోజు సాయంత్రం సమయంలో విష్ణు తన స్నేహితులతో బైక్‌పై వెళుతుండగా అడ్డగించారు. ఈ క్రమంలో మరోసారి పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో విష్ణుకు బలమైన దెబ్బలు తగలడంతో మృతి చెందాడు. దాడిలో పాల్గొన్న 11 మంది మైనర్ బాలురు, ఒక మేజర్‌ను అరెస్ట్ చేశారు. వారిపై కేసులు నమోదు చేసి, మైనర్లను వరంగల్ అబ్జర్వేషన్ హోల్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

యాచకుడి మృతి


యాచకుడి మృతదేహం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం సమీపంలో సోమవారం ఓ యాచకుడు మృతి చెందాడు. మృతుడి వయసు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని, తెలుపు రంగు జుట్టు, తెలుపు రంగు గడ్డం కలిగి ఉండి, కాషాయ రంగు చొక్కా, పసుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడని ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. కొంతకాలంగా రామాలయం వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని, అతని పేరు అప్పన్న అన్ని స్థానికుల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే 87126 82106 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

కనుమరుగైన జ్ఞాపకం!

- వందేళ్ల క్రితం ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ నిర్మాణం
- బ్రిటీష్ కాలం నుంచి సమాచార కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు
- బ్యాంకు సేవలకు పుట్టినిల్లుగా పేరు
- శిథిలమవడంతో ఇటీవల కూల్చివేత

ఖమ్మం చరిత్రను పరిశీలిస్తే గుర్తొచ్చే కొన్నింట్లో హెడ్ పోస్టాఫీస్ భవనం కూడా కళ్ల ముందు కదలాడుతుంది. ఆంగ్లేయుల కాలంలో ఖమ్మం నడిబొడ్డున ప్రజల సౌకర్యార్థం తపాలా సేవల కోసం ఈ భవనాన్ని నిర్మించారు. ఓ వైపు ఖిలా, మరోవైపు రైల్వేస్టేషన్‌కు మధ్య దాదాపు వెయ్యి గజాల స్థలంలో ఎనిమిది గదులతో ఈ భవనం నిర్మాణమైంది. దంగు సున్నంతో మందపాటి గోడలే కాక స్లాబ్ అడుగు భాగాన కర్రలను అమర్చి పకడ్బందీగా నిర్మించారు. నిర్మాణంలో వినియోగించిన ఇనుము, కలప వంటి వాటిని సుదూర ప్రాంతాల నుంచి రైలు మార్గాన ఇక్కడకు తీసుకొచ్చారని చెబుతారు. ఇలా అనేక ప్రత్యేకతలు కలిగిన హెడ్ పోస్టాఫీస్ భవనం ఏళ్ల తరబడి సేవలందించగా చాన్నాళ్ల క్రితమే ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిలిపేసి.. శిథిలావస్థకు చేరడంతో ఇటీవల కూల్చివేశారు. – ఖమ్మంగాంధీచౌక్

భౌగోళిక స్థితి ఆధారంగా ఏర్పాటు

మానవ సంబంధాలు, ప్రభుత్వ కార్యకలాపాలు, సంక్షేమ కార్యక్రమాలను నెరవేర్చడంలో తపాలా శాఖ పాత్ర ప్రధానమైంది. ఈమేరకు బ్రిటీష్ కాలంలో రవాణా సదుపాయం అందుబాటులో ఉన్న చోట తపాలా కార్యాలయాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇందులో భాగంగానే వందేళ్ల క్రితం వరంగల్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలో ఖమ్మం ఎల్ఎస్‌జీ తపాలా సేవలను ప్రారంభించారు. ఈక్రమంలో ఖమ్మంలో భవనాన్ని నిర్మించగా... ఖమ్మం జిల్లాగా ఏర్పడ్డాక 1960 జనవరి 1న ఎల్ఎస్‌జీ తపాలా కార్యాలయాన్ని హెడ్ పోస్టాఫీస్‌గా మార్చారు. అనంతరం ఖమ్మం పోస్టల్ డివిజన్‌గా ఏర్పడే వరకు హెడ్ పోస్టాఫీస్ నుంచే జిల్లా వ్యాప్తంగా సేవలందాయి. 1972లో ఖమ్మం తపాలా డివిజన్‌ను ఏర్పాటు కావడంతో డివిజన్ కార్యాకలాపాలు కూడా కొంతకాలం హెడ్ పోస్టాఫీస్ ద్వారా కొనసాగాయి. ఆపై డివిజన్ కార్యాలయాన్ని గాంధీచౌక్‌లో నిర్మించారు. కాగా, డివిజన్ పరిధిలో 76 సబ్ పోస్టాఫీస్‌లు, 535 బ్రాంచి పోస్టాఫీస్‌లు ఉండగా.. 1,600 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇక ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ పరిధిలో 37 సబ్ పోస్టాఫీస్‌లకు గాను 37 మంది బ్రాంచి పోస్టుమాస్టర్లతో ఇతర ఉద్యోగులు 700 మంది పనిచేస్తున్నారు.

నేలమట్టమైన భవనం

శిథిలమై ప్రమాదకరంగా మారిన హెడ్ పోస్టాఫీస్ పాత భవనాన్ని కూల్చివేయాలని కొన్నేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో భవనాన్ని ఖమ్మం మున్సిపల్ శాఖ అధికారులు గత గురువారం ఉదయం తొలగించింది. ఆపై స్థలం అన్యాక్రాంతం కాకుండా తపాలా శాఖ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు నిర్ణయించింది. ఏదిఏమైనా వేలాది మందికి సేవలందించి.. వందలాది మంది ఉద్యోగులు, స్థానికులకు ల్యాండ్‌మార్క్‌గా ఉన్న వందేళ్ల క్రితం నాటి భవనం నేలమట్టం కావడంతో ఖమ్మంలో ఓ జ్ఞాపకం కనుమరుగైనట్లయింది.



కూల్చివేతకు ముందు ఖమ్మం హెడ్‌పోస్టాఫీస్ పాత భవనం, (ఇన్‌సెట్) భవనం నేలమట్టం అయ్యాక...

ఆంగ్లేయుల కాలం నుంచి..

ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ ఆంగ్లేయుల కాలం నుంచి సమాచార కేంద్రంగా పనిచేస్తోంది. ఖమ్మం జిల్లా ప్రజలు వివిధ అవసరాల కోసం ఇక్కడకు వచ్చేవారు. నిత్యం గుట్టలుగా వచ్చే ఉత్తరాలను 20 మంది పోస్టుమ్యాన్లు ప్రాంతాల వారీగా వేరుచేసి రైళ్లు, బస్సుల్లో పంపించే వారు. అప్పట్లో బ్యాంకు సేవలు ఇంకా విస్తరించకపోవడంతో పోస్టాఫీసుల ద్వారానే మనీయార్డర్ల రూపంలో లావాదేవీలు జరిగేవి. అలాగే, ఎఫ్‌డీలు, సేవింగ్ బ్యాంక్ ఖాతాలు తెరిచేవారు. ఇక టెలిగ్రామ్ వ్యవస్థ రాత్రివేళల్లో కూడా పనిచేసేది. అనంతరం కాలంలో పాత భవనం శిథిలావస్థకు చేరుతుండడంతో ఆ పక్కనే కొత్త భవనాన్ని నిర్మించారు. అయినా కొన్నాళ్ల పాత భవనం నుంచే కొన్ని విభాగాల కార్యకలాపాలు కొనసాగినా ఆపై పూర్తిగా శిథిలమవడంతో మూసివేశారు.

ఎప్పుడూ రద్దీగా ఉండేది..



ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ అంటే ఓ చరిత్ర. ఉత్తరాల బట్వాడా, మనీయార్డర్లు, టెలిగ్రామ్‌ల కోసం వచ్చే వారితో ఎప్పుడూ రద్దీగా ఉండేది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఇక్కడక వచ్చేవారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన తపాలా కార్యాలయం దాదాపు వందేళ్ల పాటు సేవలందించింది.

– డి.నాగేశ్వరరావు, రిటైర్డ్ తపాలా అధికారి

ఖమ్మంకు గుర్తింపుగా...



హెడ్ పోస్టాఫీస్ ఖమ్మంకు ఓ గుర్తింపుగా ఉండేది. ఆంగ్లేయుల కాలంలో భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో తొలుత రోజుకు రూ.14 వేతనంతో పనిచేశా. ఆ తర్వాత అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వర్తించాను. ఆ రోజుల్లో ఖమ్మం తపాలా కార్యాలయం కేంద్ర బిందువుగా విరాజిల్లింది.

– వడ్లమాని వెంకటసుబ్బయ్య, రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్

ఉద్యోగులకు డీఏ విడుదల చేయాలి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులకు ప్రతీ ఆరు నెలలకోసారి ఇచ్చే కరువు భత్యం(డీఏ) తక్షణమే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతిగా ఉండి సమస్యల్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అయినా ఉద్యోగులకు డీఏ ప్రకటించకపోగా, పీఆర్సీపై స్పందన లేకపోవడం గర్హనీమన్నారు. ఇటీవల బదిలీల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవడంతో పాటు మిగిలిన ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంగళరావు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు మనోహర్‌రాజు వై.పద్మ, ముత్తయ్య, ప్రసాద రావు, వీరబాబు, రమాదేవి, వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

మెరుగైన పీఆర్సీ ప్రకటించాలి..

రాష్ట్ర ప్రభుత్వం నివేదిక తెప్పించుకుని మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించడమే కాక ఉద్యోగులకు బకాయి ఉన్న నాలుగు డీఏలు మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని యూటీయఫ్ భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే 13 నెలలు ఆలస్యమైనందున వెంటనే పీఆర్సీ ప్రకటించాలన్నారు. అలాగే, రెగ్యులర్ ఎంఈఓల నియామకంపై దృష్టి సారించాలని, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, బూట్లు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకం బిల్లులు ప్రతీ నెలా చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు బుర్రి వెంకన్న, షమి, వల్లంకొండ రాంబాబు, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాభవాని

పాతకమలాపురంలో చోరీకి యత్నం

కారేపల్లి: తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులకొట్టి ఓ వ్యక్తి చోరీకి యత్నించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతకమలాపురానికి చెందిన మల్లెల శ్రీనివాస్ కుటుంబంతో సహా రెండు నెలల క్రితం హైదరాబాద్ వెళ్లి అక్కడే జీవనం సాగిస్తున్నాడు. అప్పటి నుంచి ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గుర్తించిన ఓ దుండగుడు తలుపులు పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. అయితే, బీరువాలో ఏమీ దొరకకపోవడంతో అందులోని సామగ్రిని చిందరవందర చేసి వెళ్లిపోయాడు. తాజాగా గ్రామానికి వచ్చిన శ్రీనివాస్ చోరీ యత్నాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారాం క్లూస్ టీంతో కలిసి పరిశీలించారు.

పేకాట స్థావరంపై దాడి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం బాసారం శివారులో కొనసాగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు రూ.19వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు బోల్తా, ఇద్దరికి గాయాలు


వల్లాపురం వద్ద బోల్తాపడిన కారు

ముదిగొండ: కారు బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలైన ఘటన ముదిగొండ సమీపాన సోమవారం చోటుచేసుకుంది. మల్లన్నపాలెం గ్రామానికి చెందిన ప్రవీణ్, తిరపయ్య కారులో మధిర నుంచి స్వగ్రామానికి వస్తుండగా వల్లాపురం సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో స్వల్పగాయాలైన వీరిద్దరిని స్థానికులు కారులో నుంచి బయటకు తీసి ఆటోలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

జ్వరాల బారిన పాతర్లపాడు

- గ్రామంలో పదికి పైగా డెంగీ కేసులు
- జ్వరంతో బాధపడుతూ ఓ వ్యక్తి మృతి


జ్వరంతో మృతి చెందిన శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని పాతర్లపాడు వాసులు జ్వరాలతో అల్లాడుతున్నారు. కొద్ది రోజుల వరకు జల్లేపల్లిలో పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదు కాగా.. ప్రస్తుతం పాతర్లపాడులో ఇంటికొకరు మంచం బారిన పడ్డారు. తిరుమలాయపాలెం ఆస్పత్రిలో 73 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. మరికొందరు ఇళ్ల వద్ద, ఇంకొందరు ఖమ్మం ఆస్పత్రుల్లో చేరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చేసిన నిర్వహించిన పరీక్షల్లో 10మందికి పైగా డెంగీ బారిన పడినట్లు తేలడంతో గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తోంది. కాగా, గ్రామానికి చెందిన జడల శ్రీనివాస్‌గౌడ్(53) గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందడం విషాదాన్ని నింపింది. కాగా, తిప్పారెడ్డిగూడెం, హైదర్‌సాయిపేట, జూపెడ, చంద్రుతండా, పిండిప్రోలు తదితర గ్రామాల్లోనూ జ్వరబాధితులు ఉన్నారు. మండలంలో ఇప్పటికే 40కి పైగా డెంగీ కేసులు నమోదైనట్లు తెలుస్తుండగా, ప్రతిరోజు తిరుమలాయపాలెం, సుబ్లేడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 300కు పైగా ఓపీ నమోదవుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం, నీటి కలుషితంతో పాటు స్థానికులకు అవగాహన కల్పించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు చెబుతుండగా.. ఇకనైనా అధికారులు తిరుమలాయపాలెం మండలంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

కొత్తగూడెంలో వివాహితకు..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 15వ డివిజన్ కొత్తగూడెంలో ఓ వివాహిత డెంగీ బారిన పడింది. మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శనివారం రక్త నమూనాలు సేకరించి పరీక్షించగా ఈ విషయం వెల్లడైంది. దీంతో ఆమె ఇంట్లోని మిగతా వారితో పరిసరాల్లో ఇళ్ల వారికి సోమవారం వైద్యులు పరీక్షలు చేయడమే కాక పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.


కుటుంబ కలహాలతో ఆత్మహత్య

కల్లూరురూరల్: మండలంలోని లక్ష్మీపురం(రాళ్ల బంజరు) గ్రామానికి చెందిన గిరిజన యువకుడు గుగులోతు కృష్ణ(32) ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణ, ఆయన భార్య నడుమ కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యాన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసైన కృష్ణ సోమవారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా.. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.కే.షాకీర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: కుటుంబ కలహాలతో గడ్డిమందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని పైనంపల్లి శివారు హోల్‌తండాకు చెందిన వాంకుడోత్ నరేష్(34) ఈనెల 26న రాత్రి గడ్డిమందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతి చెందడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, నరేష్‌కు భార్య చంద్రావతి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గోదావరిలోకి దిగి వ్యక్తి...


శోభన్‌బాబు (ఫైల్)

చర్ల: మండలంలోని లింగాపురం వద్ద వరదకు కొట్టుకొస్తున్న కలప కోసం సోమవారం గోదావరి నదిలో దిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. లింగాపురానికి చెందిన కొంగూరు శోభన్‌బాబు (49) గోదావరి పాయలో వరదకు కొట్టుకు వచ్చిన కట్టెలను తీసుకొచ్చేందుకు వెళ్లి నీటిలో గల్లంతయ్యాడు. స్థానికులు వెతకగా మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సన్యాసయ్య
- జిల్లాకు చేరిన కేంద్ర అధికారుల బృందం

ఖమ్మం సహకారనగర్: విధినిర్వహణలో ప్రతిభ కనబరిచేలా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), డీఆర్డీఓ సన్యాసయ్య సూచించారు. కేంద్రప్రభుత్వ పరిధిలోని సెక్రటేరియట్ సర్వీసెస్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులు శిక్షణ, అధ్యయనం నిమిత్తం సోమవారం జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారితో కలెక్టరేట్‌లో సమావేశమైన సన్యాసయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ, ఎంపీడీఓ, పోలీసుస్టేషన్, పీహెచ్‌సీల్లో విధినిర్వహణ, ఉపాధి హామీ పనులు, మహిళా స్వయం సహాయక సంఘాల పనితీరును పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం 25మందితో కూడిన బృందంలో ఐదుగురు చొప్పున నేలకొండపల్లి మండలం నాచేపల్లి, ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెం, మధిర మండలంఖమ్మంపాడు, ఏన్కూరు మండలం నాచారం, కల్లూరు మండలం కొర్లగూడెంలో అధ్యయనానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్, ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ జిల్లా ట్రైనింగ్ నోడల్ అధికారి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యయనానికి సహకరించండి

నేలకొండపల్లి/కల్లూరు రూరల్/మధిరరూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు, స్థితిగతులు, ప్రభుత్వ పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో చేపట్టనున్న అధ్యయనానికి ఉద్యోగులు, ప్రజలు సహకరించాలని కేంద్రప్రభుత్వ అధికారులు సూచించారు. ఈమేరకు నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి, కల్లూరు మండలం కొర్లగూడెం, మధిర మండలం ఖమ్మంపాడుకు చేరుకున్న అధికారులకు స్థానిక అధికారులు స్వాగతం పలికారు. నాచేపల్లికి మోహన్‌భారతి, అభిషేక్ దేశ్‌వాల్, ఆర్యమ యుగంనకర్, రమణదీప్, కొర్లగూడెంకు సాహిల్, భువనేష్ పాండే, రోహిత్ గోసైన్, సందీప్ ఠాగూర్, వికాస్‌కుమార్ చేరుకోగా తొలిరోజు అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎంపీడీఓలు ఎం.ఎర్రయ్య, చంద్రశేఖర్, వివిధ శాఖల ఉద్యోగులు పి.బాబురావు, మహేశ్వరరెడ్డి, సురేష్‌బాబు, వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.


నేలకొండపల్లి : నాచేపల్లిలో అధికారులకు స్వాగతం పలుకుతున్న ఎంపీడీఓ యర్రయ్య తదితరులు


కూల్చివేతకు రంగం సిద్ధం

- రేపు ఉదయం కూలింగ్ టవర్ల తొలగింపు
- ఇంక్లోజన్ పద్ధతిలో నేలమట్టం
- కనుమరుగు కానున్న ఎత్తయిన టవర్లు

పాల్వంచ : పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ పాత ప్లాంట్(ఓఅండ్ఎం)లో కూలింగ్ టవర్ల కూల్చివేతకు రంగం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం ఇంక్లోజన్ పద్ధతి(ఒకేచోట కుప్పకూలేలా)లో తొలగింపునకు చర్యలు చేపట్టారు. కర్మాగారంలో మూడు స్టేషన్లలోని ఎనిమిది టవర్లను తీసేయనున్నారు. దీంతో పాల్వంచకే తలమానికంగా కనిపించే టవర్లు ఇక కనుమరుగు కానున్నాయి. కర్మాగారంలోని అత్యంత ఎత్తయిన ఈ టవర్ల కూల్చివేత మినహా మిగిలిన విభాగాలను ఇప్పటికే నేలమట్టం చేసి, వాటి తుక్కును తరలించేశారు. కూలిగ్ టవర్ల కూల్చివేతకు ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో అనుమతులు పెండింగ్‌లో పడ్డాయి. టవర్లతో పాటు గతంలో నేలమట్టం చేసిన పనులకు సంబంధించి జెన్‌కో సంస్థ టెండర్లు ఆహ్వానించగా రూ.485 కోట్లకు హెచ్ఆర్ కమర్షియల్ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకుంది.

ఐదు నెలల క్రితమే చిమ్నీలు..

కేటీపీఎస్ పాత ప్లాంట్‌లో 100, 120 మీటర్ల ఎత్తులో ఉండే చిమ్నీలను గత ఫిబ్రవరిలోనే నేలమట్టం చేశారు. ఈ నిర్మాణాల కూల్చివేత పనుల దృశ్యాలు మరువని జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. ఇక టవర్ల కూల్చివేత పనులు పూర్తి చేయాలంటే చుట్టూ ఎక్స్‌ప్లోజర్లను పెట్టి పక్కకు పడకుండా ఇంక్లోజన్ పద్ధతిలో కుప్పకూలేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల ఢిల్లీలోని నోయిడా టవర్లను కూల్చిన టెక్నీషియన్లతోనే హెచ్ఆర్ కమర్షియల్ సంస్థ ఇక్కడ కూడా పనులు చేయించనున్నట్లు తెలిసింది.


కూల్చివేయనున్న కేటీపీఎస్ పాత ప్లాంట్ కూలింగ్ టవర్లు

పట్టణానికే ప్రత్యేక గుర్తుగా..

కూలింగ్ టవర్లు అత్యంత ఎత్తయినవిగా కనిపిస్తుంటాయి. ఈ ప్రాంతానికి వచ్చే ప్రజలు, కిన్నెరసానికి వెళ్లే పర్యాటకులు ఈ టవర్లను ఫొటోలు తీసుకుంటూ మురిసిపోతుంటారు. 1965 – 67 సంవత్సరాల మధ్య నిర్మించిన కేటీపీఎస్ ఏ, బీ, సీ స్టేషన్లలో 60 మెగావాట్ల సామర్థ్యం గల 1, 2, 3, 4 యూనిట్లు, 120 మెగావాట్ల సామర్థ్యం గల 5, 6, 7, 8 యూనిట్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌కు ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఎనిమిది కూలింగ్ టవర్లు నిర్మించారు. విద్యుత్ ఉత్పత్తి చేసే క్రమంలో నీరు, బొగ్గు మండించినప్పుడు వచ్చే వేడిని తగ్గించేందుకు కూలింగ్ టవర్లు ఉపకరిస్తాయి. ఈ టవర్లను చూసేందుకు సైతం అనేక మంది టూరిస్టులు ఆసక్తి కనబరుస్తుంటారు.

భూస్వామ్య విధానం రద్దు కావాలి

ఖమ్మంమయూరిసెంటర్: భూమి, ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం కోసమే కాక భూస్వామ్య విధానం రద్దు చేయాలనే డిమాండ్‌తో పోరాడాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఓపీడీఆర్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జతిన్‌కుమార్ పిలుపునిచ్చారు. యూసీసీ ఆర్ఐ(ఎంఎల్) గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యాన భక్తరామదాసు కళాక్షేత్రం సోమవారం దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమేల నాగిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ విప్లవ ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ ఉద్యమంలో అన్నివర్గాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ పాలకులతో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని భావిస్తే పదేళ్లలో ఏమీ జరగలేదన్నారు. గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి, అధ్యక్షుడు పడిగా ఎర్రయ్య మాట్లాడుతూ పేదలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని పన్నులు కడుతున్నా కరెంట్, నీళ్లు, రోడ్లు సౌకర్యాలు మెరుగుపరచడం లేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మౌలిక వసతుల కోసం ప్రజలు డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ఈ సభలో నాయకులు కల్లీ ఎర్రబాబు, పోలెబోయిన ముత్తయ్య, దండా లింగయ్య, పర్వతరెడ్డి, కత్తి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జతిన్‌కుమార్, పక్కన నాయకులు